# పొగాకు సాగు పద్ధతులు

## ఉత్తర తేలిక నేలల్లో వర్జీనియా పొగాకు సాగు పద్ధతులు

ఆంధ్ర ప్రదేశ్లోని పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి మరియు తెలంగాణలోని ఖమ్మం జిల్లాలలో నీటి పారుదల క్రింద రబీ సీజనులో పొగాకు పండించే నేలలను ఉత్తర తేలిక నేలలుగా వ్యవహరిస్తారు. ఈ ప్రాంతంలో ఉత్పత్తి చేసిన వర్జీనియా పొగాకు మంచి నాణ్యత కలిగి ఉండటం వలన మంచి ధర లభిస్తుంది. ఈ ఉత్తర కోస్తా తేలిక నేలల్లో ఇసుక శాతం ఎక్కువగా ఉండటం వలన, నీరు నిల్వ లేకుండా పొగాకు సాగుకు బాగా అనుకూలంగా ఉంటాయి.

### నేలల ఎంపిక మరియు భూమి తయారి

- నీరు నిలవని మరియు కరిగే లవణాలు తక్కువగా (<0.40 dS/m, క్లోరైడ్ <100 పి.పి.ఎం.) కలిగిన లోతట్టు ఇసుక నేలలు పొగాకు సాగుకు అనుకూలమైనవి.
- ఎంచుకున్న నేలలో వేసవిలో లోతుగా దుక్కులు చేసుకోవాలి.
- హెక్టారుకు 12 టన్నుల పశువుల ఎరువు హెక్టారుకు 50 కిలోలు జనుము విత్తనమును విత్తి, పూత వచ్చుటకు ముందుగా కలియదున్నాలి.
- 2-3 సార్లు ట్రాక్టర్ డిస్క్ / గొర్రుతో దుక్కిచేసి బల్లతో ఎత్తు పల్లాలు లేకుండా చదును చేసుకోవాలి.

### సిఫార్సు చేసిన వంగడములు / హైబ్రిడ్లు

- సి.టి.ఆర్.ఐ. నవీణ (ఎఫ్ సిజె 11), కాంచన్, ఎల్.టి.కాంచన్ మరియు సి.హెచ్.1.

### నాట్లు వేసే సమయం

- ఉత్తర కోస్తా ఎగువ ప్రాంతాలలో సెప్టెంబరు 15 నుండి అక్టోబరు 15 వరకు, అలాగే దిగువ ప్రాంతాలలో అక్టోబరు 15 నుండి నవంబరు 15 వరకు నాట్లకు అనువైన సమయం.
- వరుసల మధ్య దూరం 100 సెం.మీ., మొక్కల మధ్య 60 సెం.మీ. (హెక్టారుకు 16,666 మొక్కలు) ఉండేటట్లుగా మార్కరు తోలాలి.
- వరుసల, మొక్కలు మార్కరులు కలిసే స్థానంలో చాలు అంచున మొక్కలు పాతి, నాట్లు పూర్తి చేయాలి.
- ట్రే మొక్కలు ఉపయోగించడం వలన మణేదలు ఎక్కువగా లేకుండా ఉంటాయి. తప్పనిసరి పరిస్థితులలో మణేదలే వేయవలసి వచ్చినచో 7 రోజుల్లోపు పూర్తి చేయాలి.

## అంతరకృషి

- నారు నాటిన 10-15 రోజులకు మొక్కలు నిలదొక్కుకున్న తరువాత కలుపు మొక్కల తీవ్రతను బట్టి గొర్రు మరియు గుంటకలుతో చాళ్ళ మధ్య రెండువైపులా 3-4 సార్లు ఎడసేద్యం చెయ్యాలి.
- 40 రోజుల తరువాత పళ్ళగొర్రుతో గాని, పారలతో గాని మొక్కల మొదలుకు బాగా మట్టి ఎక్కేటట్లుగా గట్లు ఎక్కవేసి వరుసల మధ్య బోదెలను తయారు చెయ్యాలి.
- తరువాత పంట పెరుగుదలను బట్టి రిడ్జరుతో గాని, పారలతో గాని మట్టి ఎక్కువేస్తూ మొక్కలకు నీరు సరిగా అందేటట్లుగాను, నీటి పొదుపుకు సహాయకారులుగాను ఉండేటట్లుగా ఈ గట్లను, బోదెలను ఏర్పాటు చేసుకోవాలి.
- అంతరకృషి చేయడానికి వీలుకాని పరిస్థితిలో గడ్డి జాతి కలుపు మొక్కలు నివారించడానికి క్విజలోఫాఫ్ ఇథైల్ను 60 గ్రా॥/హెక్టారుకు పిచికారి చేయాలి.

## నీటి యాజమాన్యం

- క్లోరైడ్ పరిమాణము 50 పి.పి.ఎం. లోపున ఉన్న ఏ నీరయినా అంటే కాలువ నీరు, చెరువు నీరు, నూతి నీరు లేదా బోరు నీరును పొగాకు తోటలకు తడులు పెట్టుటకు వాడవచ్చు.
- వాతావరణం మరియు మొక్క ఎదుగుదలను బట్టి బోదెలలో నీరు పారించి సుమారు 8-10 తడులు పెట్టాలి.
- డ్రిప్ పద్ధతిలో నీరు ఇస్తే ప్రతీ మొక్క వద్ద డ్రిప్పర్ వచ్చేటట్లు అమర్చుకోవాలి. పంట దశను బట్టి 15-30 నిమిషాల వరకు రోజు మార్చి రోజు డ్రిప్ ద్వారా నీరు పెట్టాలి. ఈ డ్రిప్ పద్ధతిలో నీరు పెట్టడం వలన నీటి వినియోగ సామర్థ్యం పెరిగి పంట దిగుబడి మరియు నాణ్యత మెరుగవుతుంది.

## ఎరువుల వాడకం

- వర్జీనియా పొగాకులో ఎరువులను 3 దఫాలుగా అంటే 7-10 రోజులకు, 25-30 రోజులకు, 40-45 రోజులకి మొక్కలకు అందించాలి. మొక్కకు రెండు వైపులా 10. సెం.మీ. దూరంలో, 10 సెం.మీ. లోతులో కన్నాలు చేసి ఎరువులు వేసి మూసివేయాలి. ఎరువు, దాని మోతాదు మరియు వేసే సమయం క్రింది పట్టికలో సూచించడమైనది.
- బాగా తేలిక పాటి నేలల్లో వీలైన చోట పొటాషియం సల్ఫేట్ ఎరువును (హెక్టారుకు 300 కిలోలు) నాలుగు సమాన దఫాలుగా విభజించి (75 కిలోల చొప్పున) పైన తెలిపిన మూడు దఫాలతో పాటు నాల్గవ దఫా ఎరువును 70 రోజుల మొక్కలకు అందించిన యెడల నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు పొందవచ్చు.

| ఎరువు వేసే సమయం | ఎరువు పేరు | మోతాదు (కిలో/హెక్టారు) | పోషకాలు N-$P_2O_5$-$K_2O$-Ca (కిలో/హెక్టారు) |
|---|---|---|---|
| బేసల్ అప్లికేషన్ | డోలమైట్ | 200 | 0-0-0-48 |
| మొదటి దఫా/ హెక్టారు | డై-అమ్మోనియం ఫాస్ఫేట్ | 100 | 18-46-0-0 |
| | సల్ఫేట్ ఆఫ్ పొటాష్ | 100 | 0-0-50-0 |
| రెండవ దఫా / హెక్టారు | అమ్మోనియం సల్ఫేట్ | 250 | 51-0-0-0 |
| | సల్ఫేట్ ఆఫ్ పొటాష్ | 100 | 0-0-50-0 |
| మూడవ దఫా / హెక్టారు | యూరియా | 100 | 46-0-0-0 |
| | సల్ఫేట్ ఆఫ్ పొటాష్ | 100 | 0-0-50-0 |
| | మొత్తము | | 115-46-150-48 |

### వర్షాల కారణంగా ఎరువుల సర్దుబాటు

- రెండో దఫా ఎరువులు వేసిన తరువాత ఎప్పుడైనా వర్షాలు 12.5 సెం.మీ. పడితే, పైన ఇచ్చిన ఎరువులు కాక, హెక్టారుకు 6 కిలోల నత్రజనిని మరియు 7.5 కిలోల పొటాష్ అదనపు మోతాదు ఇవ్వవలసి ఉంటుంది.
- మరీ అధికంగా వర్షాలు 25 సెం.మీ. పడితే పైన ఇచ్చిన ఎరువులు కాక, హెక్టారుకు 15 కిలోల నత్రజని మరియు 20 కిలోల పొటాష్ అదనపు మోతాదుగా ఇవ్వవలసి ఉంటుంది.

### ఫెర్టిగేషన్

- 80 శాతం సిఫార్సు చేయబడిన (115 నత్రజని-60 భాస్వరం- 120 పొటాషియం) ఎరువులను డ్రిప్ పద్ధతి ద్వారా ఫెర్టిగేషన్ చేయడం వలన దిగుబడులు హెచ్చు, ఎరువలపై పెట్టే ఖర్చు 20 శాతం తగ్గుతుంది.

# దక్షిణ తేలిక నేలల్లో వర్జీనియా పొగాకు సాగు పద్ధతులు

ఆంధ్రప్రదేశ్లోని ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన పొగాకు పండించే ఎర్రనేలలను దక్షిణ కోస్తా తేలిక నేలలుగా వ్యవహరిస్తారు. ఇవి కొద్దిపాటి ఒండ్రు కలిగి, తటస్థము నుండి కొద్దిపాటి క్షార స్వభావము గల నేలలు. మితమైన నీరు నిలువ ఉండే గుణం, తక్కువ సేంద్రియ పదార్థము కలిగినవి. తేమ తక్కువ గల

ఈ నేలల్లో వర్షాధారంగా పొగాకును రబీలో సాగు చేస్తారు. ఈ ప్రాంతంలో వాతావరణ పరిస్థితులు చాలా అనిశ్చితముగా ఉంటాయి.

## నేలల ఎంపిక మరియు భూమి తయారీ

- నీరు నిలవని, లోతయిన మరియు సరైన వాలు గల నేలలు ఎంచుకోవాలి.
- తక్కువ లోతు వున్న గట్టి నేలలు లేదా ఉప్పు నేలలను ఎంచుకోరాదు. భూమిలో క్లోరైడ్ మోతాదు 100 పి.పి.ఎమ్ కన్నా తక్కువగా ఉండాలి.
- ఎంచుకున్న నేలలో వేసవిలో లేతుగా దుక్కి చేసుకోవాలి. దీనివలన కలుపు మొక్కలు, రోగకారక క్రిములు, సూక్ష్మజీవులు బయటపడి ఎండ తీవ్రతకు నశిస్తాయి.
- నేల తేమను మరియు భూసారాన్ని పెంపొందించడానికి సేంద్రియ ఎరువులను (హెక్టారుకు 2-2.5 టన్నుల పశువుల ఎరువు, పచ్చిరొట్ట ఎరువు) నేలలోకి కలియదున్నాలి.
- 2-3 సార్లు ట్రాక్టర్ డిస్క్ / గొర్రుతో దుక్కి చేసి బల్లతో ఎత్తు పల్లములు లేకుండా చదును చేసుకోవాలి.

## సిఫార్సు చేసిన వంగడములు

- సి.టి.ఆర్.ఐ. శ్రేష్ఠ (ఎఫ్ సిఆర్ 15), సిరి, ఎన్.98, విటి-1158, సి.టి.ఆర్.ఐ. సులక్షణ మరియు హేమ.

## నాట్లు వేసే సమయం

- అక్టోబరు 15 నుండి నవంబర్ 15 లోపున నాట్లు వేయుటకు అనువైన సమయము
- నాట్లు వేసుకునే ముందు వరుసల మధ్య దూరము 70 సెం.మీ., మొక్కకు మొక్కకు మధ్య దూరము 50 సెం.మీ. (హెక్టారుకు 28,571 మొక్కలు) ఉండేటట్లుగా మార్చరు తోలాలి.
- చదునుగా వున్నప్పుడే నాట్లు వేసి, తరువాత అంతరకృషి చేసేటప్పుడు గట్లు కట్టాలి.
- పది రోజుల లోపునే మణేదలు పూర్తిచేయాలి.

## అంతర కృషి

- నాట్లు వేసిన 20-50 రోజుల మధ్యలో 2-3 సార్లు గొర్రుతో తరువాత గుంటకతో అంతరకృషి చేయాలి.

## నీటి యాజమాన్యం

- నిరంతరం పొడి వాతావరణం ఏర్పడినప్పుడు మొక్కలు నాటిన 40-50 రోజుల మధ్యలో స్వచ్ఛమైన నీరు లభ్యమైతే (క్లోరైడ్ 50 పి.పి.ఎం. కంటే తక్కువ కలది) లేదా నిలువ చేసిన వర్షపు నీటితో ఒక తడి పెట్టి పైరును కాపాడవచ్చు.

## ఎరువుల వాడకం

సిఫార్సు చేయబడిన రసాయనిక ఎరువుల మోతాదు. ఎరువు, దాని మోతాదు మరియు వేసే సమయం క్రింది పట్టికలో సూచించడమైనది

| ఎరువు పేరు | మోతాదు (కిలో/హెక్టారు) | పోషకాలు $N-P_2O_5-K_2O-Ca$ (కిలో/హెక్టారు) |
|---|---|---|
| డై-అమ్మోనియం ఫాస్పేట్ | 75 | 13.5-34.5-0 |
| కాల్షియం నైట్రేట్ | 50 | 8-0-0-9.5 |
| అమ్మోనియం సల్ఫేట్ | 180 | 37.8-0-0 |
| సల్ఫేట్ ఆఫ్ పొటాష్ | 120 | 0-0-60 |
| సల్ఫేట్ ఆఫ్ పొటాష్ (పొదిలి) | 150 | 0-0-80 |
| మొత్తము | | 60-35-60 నుండి 80-9.5 |

- నాటుటకు 15 రోజుల ముందుగా మొక్క వేసే చాళ్ళ దగ్గర నాగలి చాలుతోలి, ఎరువులు వేసి, బల్లతో గాని, కంపతోగాని కప్పివేయాలి. దీని వలన మొక్కకు పోషకాలు బాగా లభిస్తాయి.

## నీటి ఎద్దడి సమయంలో తీసుకోవలసిన చర్యలు

- నేలలో తేమను ఎక్కువ సమయం నిల్వ ఉంచటానికి ఆర్చాదన (మల్చింగ్), సేంద్రియ మరియు నూతన నేల సంరక్షణ పద్ధతులను పాటించాలి.
- మొక్క పెరుగుదల దశలో (30-40 రోజులలో) జిబ్బరిల్లిక్ యాసిడ్ (50 పిపిఎం) ని పిచికారి చేయాలి
- ఋతుపవనాలు ఆలశ్యం అయినప్పుడు అధిక సాంద్రతతో మొక్కలు వేయడం ద్వారా ఎక్కువ దిగుబడి పొందవచ్చు.

# నల్లరేగడి నేలల్లో వర్జీనియా పొగాకు సాగు పద్ధతులు

నల్లరేగడి భూములలో వర్షాధార పంటగా వర్జీనియా పొగాకు పండించబడుతుంది. ఈ భూమలలో నిలువ వున్న తేమను ఆధారంగా చేసుకొని పొగాకును రబీ పంటగా పండిస్తారు. భౌగోళికంగా నల్లరేగడి నేలలు ఈ క్రింది విధంగా వర్గీకరించవచ్చును.

1) ఉత్తర కోస్తా నల్ల నేలలు- తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలు

2) దక్షిణ కోస్తా నల్ల నేలలు- ప్రకాశం, నెల్లూరు జిల్లాలు

ఈ ప్రాంతాలలో పండించిన పొగాకును సిగరెట్ తయారీలో ఫిల్లర్గా ఉపయోగిస్తారు.

## నేలల ఎంపిక మరియు భూమి తయారీ

- ముందు సంవత్సరం పంటలకు ఎక్కువ నత్రజని వేసిన భూములు, లోతట్టు మరియు మురుగు నీరు పోయే సదుపాయము లేని భూములను ఎంచుకోరాదు. భూమిలో క్లోరైడ్ మోతాదు 100 పి.పి.ఎమ్ కన్నా తక్కువగా ఉండాలి.
- వేసవిలో మౌల్ట్ బోర్డు ట్రాక్టర్తో లోదుక్కి చెయ్యాలి.
- రెండు లేక మూడు దఫాలు గొర్రుతో భూమి దున్ని, తరువాత గుంటకతో చదును. చెయ్యాలి.

## వంగడములు

- సిరి, విటి-1158, సి.టి.ఆర్.ఐ. సులక్షణ మరియు హేమ.

## నాట్లు వేసే సమయం

- అక్టోబర్ 15 నుండి నవంబర్ 15 మధ్యలో 70×50 సెం.మీ. (హెక్టారుకు 28,571 మొక్కలు) దూరంలో నాటాలి.
- పది రోజుల లోపు చనిపోయిన లేదా నాసిగా వున్న మొక్కలను తీసివేసి మణేదలు నాటుకోవాలి. మణేదలకు ట్రే మొక్కలు వేసుకంటే పంట అంతా ఒకేసారి రెలుపుకు వస్తుంది.

## అంతర కృషి

- మొక్క నాటిన 20-50 రోజుల మధ్యలో 2-3 సార్లు అంతరకృషి జరపాలి. దీని వలన పగుళ్ళు కప్పబడి, తేమ నిల్వ ఉండడమే కాకుండా కలుపు మొక్కలు నశిస్తాయి.

## నీటి యాజమాన్యం

- ఈ నేలల్లో నిలువ వున్న తేమను ఆధారముగా చేసుకొని పంట పండిస్తారు.
- ఒకవేళ అవసరమైతే మొక్కలు నాటిన 40 రోజుల లోపు నిల్వ చేసిన వర్షపు నీరుతో ఒక తడిపెట్టి పైరును కాపాడవచ్చును.

## ఎరువుల వాడకం

- ఈ నేలల్లో పశువుల పెంట (హెక్టారుకు 2.5 టన్నులు) మరియు పచ్చిరొట్ట ఎరువులు సమపాళ్ళలో దుక్కిలో వేయడం వలన మంచి దిగుబడి లభిస్తుంది.
- సకాలంలో కలుపు తీయడం వలన మొక్కలకు పోషకాలు బాగా లభిస్తాయి:
- క్రింద వివరించిన ఎరువులను నాటుటటకు 15 రోజుల ముందుగా మొక్కలు వేసే చాళ్ళలో నాగలి తోలి, ఎరువులు వేసి, బల్ల గాని, కంప గాని తోలి కప్పివేయాలి.

## సిఫార్సు చేయబడిన ఎరువులు

క్రింద సూచించబడిన రెండు రకాల (ఎ & బి) ఎరువుల సిఫార్సులలో ఏదో ఒకటి అనుసరించాలి.

## ఉత్తర కోస్తా నల్ల నేలలు

### ఎ) మొదటి సిఫార్సు

| ఎరువు పేరు | మోతాదు (కిలో/హెక్టారుకు) | N-$P_2O_5$-$K_2O$-Ca (కిలో/హెక్టారుకు) |
|---|---|---|
| 20-20-0 | 125 | 25-25-0 |
| అమ్మోనియం సల్ఫేట్ | 100 | 20-0-0 |
| సల్ఫేట్ ఆఫ్ పొటాష్ | 50 | 0-0-25 |
| మొత్తము | | 45-25-25 |

### బి) రెండవ సిఫార్సు

| ఎరువు పేరు | మోతాదు (కిలో/హెక్టారుకు) | N-$P_2O_5$-$K_2O$-Ca (కిలో/హెక్టారుకు) |
|---|---|---|
| అమ్మోనియం సల్ఫేట్ | 170 | 35-0-0 |
| డై-అమ్మోనియం ఫాస్ఫేట్ | 55 | 10-25-0 |
| సల్ఫేట్ ఆఫ్ పొటాష్ | 50 | 0-0-25 |
| మొత్తము | | 45-25-25 |

## దక్షిణ కోస్తా నల్ల నేలలు

### ఎ) మొదటి సిఫార్సు

| ఎరువు పేరు | మోతాదు (కిలో/హెక్టారుకు) | N-$P_2O_5$-$K_2O$-Ca (కిలో/హెక్టారుకు) |
|---|---|---|
| 20-20-0 | 250 | 50-50-0 |
| అమ్మోనియం సల్ఫేట్ | 50 | 10-0-0 |
| సల్ఫేట్ ఆఫ్ పొటాష్ | 100 | 0-0-50 |
| మొత్తము | | 60-50-50 |

### బి) రెండవ సిఫార్సు

| ఎరువు పేరు | మోతాదు (కిలో/హెక్టారుకు) | N-$P_2O_5$-$K_2O$-Ca (కిలో/హెక్టారుకు) |
|---|---|---|
| అమ్మోనియం సల్ఫేట్ | 200 | 40-0-0 |
| డై-అమ్మోనియం ఫాస్ఫేట్ | 100 | 18-46-0 |
| సల్ఫేట్ ఆఫ్ పొటాష్ | 100 | 0-0-50 |
| మొత్తము | | 58-46-50 |

# వర్జీనియా పొగాకు సాగు పద్ధతులు

## నారు ఎంపిక

- నారుమడి కట్టుటకు నీరు నిలకడ లేని ఎర్రగరప నేలలు కాని, ఇసుక నేలలు కాని అనువైనవి.
- నారుమడి తయారు చేసుకునేటప్పుడు కాలువ కంటే మడి 15 సెం.మీ. ఎత్తులో ఉండాలి.
- విత్తుటకు ముందు 10చ. మీ. మడికి 25 కిలోల పశువుల పెంట, 300గ్రా॥ సింగిల్ సూపర్ ఫాస్పేట్, 50 గ్రా॥ అమ్మోనియం సల్ఫేట్, 100 గ్రా॥ పొటాషియం సల్ఫేట్ మరియు 50గ్రా॥ డోలమైట్ లేదా 50గ్రా॥ మెగ్నిషియం సల్ఫేట్ తప్పనిసరిగా వేయాలి.
- నారుమడుల నుండి ఆరోగ్యంగా, ధృఢంగా పెన్సిల్ లావంత మందం కాండం కలిగి 50-60 రోజుల వయసు కలిగిన నారును ఎంపిక చేసుకోవాలి.
- సాధారణ మడులలో పెంచుకున్న పొగాకు వారు కన్నా ట్రేలలో పెంచిన నారును ఉపయోగించడం వలన చీడ పీడల నుండి రక్షించుకోవడమే కాకుండా నాటిన షాక్ నుండి మొక్కలను కాపాడుకోవచ్చు. ఈ పద్ధతి ద్వారా ఉత్పత్తి అయిన నారు నాటడం వలన పొలంలో మణేదలు తగ్గి, మొక్కలు అన్నీ సమానంగా పెరిగి అధిక దిగుబడి వస్తుంది.

## కీటకాల యాజమాన్యం

### 1. నేల పెంకు పురుగు/ మకిలి పురుగు (గ్రౌండ్ బీటిల్)

- క్లోరాంట్రానిలిప్రోల్ 18.5 ఎస్.సి. 3 మి.లీ./10లీ. నీటికి కలిపి నాటడానికి ఒక రోజు ముందు నారుమడిపై లేదా ట్రేలపై పిచికారి చేసుకోవాలి.
- గుప్పెడు ఇసుకతో కలిపిన 5 గ్రాముల గానుగ పిండి లేక వేప పిండిని మొక్కలు నాటిన వెంటనే మొక్క మొదట్లో వేయాలి.
- పొగాకు తోటలో నాట్లు వేశాక, 6-7 మీటర్లకు ఒక చోట నేలపై నీళ్ళు చల్లి గడ్డికుప్పలను పేరిస్తే, మకిలి పురుగులు వాటి క్రిందకు చేరుకుంటాయి. మరుసటి రోజు వాటిని నాశనం చేయాలి.

### 2. పొగాకు లద్దె పురుగు / జల్లెడ పురుగు (టొబాకో కాటర్పిల్లర్, స్పోడోప్టరా)

- నాట్లు పడిన 20 రోజున హెక్టారుకు 10 లింగాకర్షక బుట్టల చొప్పున ఏర్పాటు చేయాలి.
- పురుగు ఆశించకుండా 0.5 శాతం వేప గింజల కషాయమును పిచికారి చేయాలి.
- స్పోడోప్టరా ఎన్.పి.వి. (ఎస్.ఎల్.ఎన్.పి.వి.) హెక్టారుకు 250 ఎల్.ఇ. ను పిచికారి చేయాలి (250 వైరస్ సోకిన పురుగుల మిశ్రమాన్ని 1000 లీ. నీటిలో కలపాలి. దీనికి 2.5 కేజి బెల్లం కలుపుకోవాలి)

- పురుగు ఉధృతి విపరీతముగా ఉంటే, ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 ఎస్.జి. 5 గ్రా||/10 లీ. నీటికి కలిపి పిచికారి చేయాలి. లేదా
- నొవల్యురాన్ 10 ఇ.సి. ని 10 మి.లీ. / 10 లీ. నీటికి కలిపి పిచికారి చేయాలి.

### 3. తెల్ల దోమ (వైట్ ఫ్లై)

- తెల్లదోమ ఉనికిని గమనించుటకు జిగురు అట్టలను హెక్టారుకు 10 చొప్పున అమర్చుకోవాలి. వాటి పరిమాణం 12×15 సెం.మీ. తో 2 మి.మి. మందముతో ఉండాలి.
- జిగురు అట్టల మీద 100 తెల్ల దోమలు కనిపిస్తే, 15 రోజుల వ్యవధిలో 3-4 సార్లు (నారుమళ్ళలో విత్తనం మొలకెత్తిన నెల రోజులకు మళ్ళీ తోటలో నాటిన 10వ రోజు నుండి) క్రింద తెలిపిన కీటకనాశినులను ఉపయోగించాలి.
- థయామిథాక్సామ్ 25 డబ్ల్యు.జి. 2 గ్రా|| లేక పైమెట్రోజిన్ 50 డబ్ల్యు.జి. 4గ్రా|| లేక ఫ్లోనికామిడ్ 50 ఎస్.జి. 4 గ్రా|| లేక ఇమిడాక్లోప్రిడ్ 200 ఎస్.ఎల్. 2.5 మి.లీ. చొప్పున 10 లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి.

### 4. పేనుబంక/ తేనె మంచు పురుగులు (అఫిడ్స్)

- పేనుబంక 2 శాతం మొక్కలను తీవ్రంగా ఆశించినా, 5 శాతం మొవ్వ ఆకులను ఆశించిన క్రింద పేర్కొన్న కీటకనాశినులను ఉపయోగించాలి.
- ఇమిడాక్లోప్రిడ్ 200ఎస్.ఎల్. 2.5 మి.లీ. లేక థయామిథాక్సామ్ 25 డబ్ల్యు.జి. 2 గ్రా|| లేక ఫ్లోనికామిడ్ 50 ఎస్.జి. 4 గ్రా|| లేక పైమెట్రోజిన్ 50 డబ్ల్యు జి. 4 గ్రా|| చొప్పున 10 లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి.

### 5. శనగపచ్చ పురుగు/ మొవ్వ పురుగు (బడ్ వార్మ్)

- తోట చుట్టూ ఎరపంటగా బంతి మొక్కలను రెండు వరుసల్లో నాటుకుంటే రెక్కల పురుగు బంతిపువ్వులపై గుడ్లు పెడుతుంది. వాటిని నాశనం చేయటం ద్వారా పొగాకు మొక్కలను కాపాడవచ్చు.
- మొక్కలు నాటిన 4 వారాలకు హెక్టారుకు 10 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి.
- హెక్టారుకు 10 చొప్పున పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి.
- తలలు తృంచని తోటల్లో హెలికోవెర్పా న్యూక్లియర్ పాలిహెడ్రోసిస్ వైరస్ను 250 ఎస్.ఇ. చొప్పున (250 వైరస్ సోకిన పురుగుల మిశ్రమాన్ని 1000 లీ. నీటిలో కలపాలి), ఒక హెక్టారు తోటలో పిచికారి చేయాలి. ఈ ద్రావణానికి 2.5 కిలోల బెల్లం కలిపితే ఎక్కువ ఫలితం చేకూరుతుంది.
- బేసిల్లస్ తురింజియెన్సిస్ కుర్ స్ కి (బీటి)ని 10 గ్రా|| / 10 లీ. నీటికి కలిపి పంటపై జల్లవచ్చును.
- బీటీ, ఎన్పివీ వాడినప్పుడు సాయంత్రపు వేళ పిచికారి చేయాలి.
- పురుగు ఉధృతి 10 శాతం మించితే, ఫ్లూబెండియమైడ్ 480 ఎస్.సి. 2.5 మి.లీ. లేక క్లోరాంట్రానిలిప్రోల్ 18.5 ఎస్.సి. 3 మి.లీ. ను 10 లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి.

## తెగుళ్ళ యాజమాన్యం

### 1. గోధుమ మచ్చ తెగులు (బ్రౌన్ స్పాట్)

- సిఫారసు చేసిన మోతాదులో మొక్కలకు పొటాష్ను అందించాలి..
- ప్రోపికొనజోల్ 0.1 శాతం (10 మి.లీ.) ను 10 లీ. నీటిలో కలిపి ఆకు ఉపరితలం పూర్తిగా తడిచేలా పిచికారి చేయాలి.

### 2. నల్లకాడ/ మానుమచ్చ/ మాను కుళ్ళు తెగులు (లీఫ్ బ్రైట్/ బ్లాక్ షాంక్)

- తరుచూ తెగులు ఆశించే తోటల్లో పంట మార్పిడి పాటించాలి.
- ట్రైకోడెర్మా విరిడి ($2\times10^7$ సి.ఎఫ్.యు/గ్రా.) ని వేప పిండి (30 గ్రా./చ.మీ.)తో కలిపి వేయాలి.
- ప్రతి మొక్కకు 75-100 మి. లీ. బోర్డో మిశ్రమము (10 లీ. నీటిలో 40 గ్రా. కాపర్ సల్ఫేట్ + 40 గ్రా. సున్నం) పాదులో పోయాలి.
- 0.2 శాతం కాపర్ ఆక్సిక్లోరైడ్ ను (10 లీ. నీటిలో 20గ్రా.) లేక ఫినామిడాన్ + మాంకోజెబ్ 60 డబ్ల్యు.జి.(10 లీ. నీటిలో 30గ్రా.) పిచికారి చేయాలి. లేదా
- 0.2 శాతం మెటలాక్సిల్ + మాంకోజెబ్ 72 డబ్ల్యు.పి. ని (10 లీ. నీటిలో 20 గ్రా.) పిచికారి చేయవచ్చును. దీని వాడకాన్ని రెండు సార్లకు పరిమితం చేయాలి.

### 3. పక్షవాతం తెగులు/ వేరుకుళ్ళు తెగులు (ఫ్యూజేరియమ్ విల్ట్)

- భూమిలో సేంద్రియ పదార్థం సమంగా ఉంటే ఈ తెగులు దరిచేరదు.
- ట్రైకోడెర్మా విరిడి ($2\times10^7$ సి.ఎఫ్.యు/గ్రా.) ని వేప పిండి (30గ్రా./చ.మీ.) తో కలిపి వేయాలి.
- జొన్న మొక్క జొన్నతో కనీసం రెండు సంవత్సరాల పాటు పంటమార్పిడి చేయాలి.

### 4 క్యాబేజి తెగులు (సి.ఎం.వి.)

- ఈ వైరస్ తెగుళ్ళను అరికట్టడానికి ఏ విధమైన రసాయనిక మందులు అందుబాటులో లేవు. కావున వైరస్ వాహకాలైన పేనుబంకను నివారించటమే ఏకైక మార్గం.

### 5. ఆకుముడత తెగులు (టి.ఎల్.సి.వి.)

- ఈ వైరస్ తెగుళ్ళను అరికట్టడానికి ఏ విధమైన రసాయనిక మందులు అందుబాటులో లేవు. కావున వైరస్ వాహకాలైన తెల్లదోమను నివారించటమే ఏకైక ఉపాయం.

### 6. సీతాఫలం మచ్చ తెగులు/ బొబ్బ తెగులు (టి.ఎం.వి.)

- ఈ వైరస్ తెగులును అరికట్టడానికి ఏ విధమైన రసాయనిక మందులు అందుబాటులో లేవు. పొగాకు తోటలో పారిశుధ్యానికి ప్రాధాన్యతనివ్వాలి.
- తెగులు సోకిన మొక్కలను తాకరాదు.
- రైతులు బొబ్బ తెగులు సోకిన పొలములో నుండి వచ్చాక చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కొని మాత్రమే వేరే తోటలోనికి వెళ్ళవలెను.

- వేప, బచ్చలి, కాగితం పువ్వు ఆకు కాషాయానికి 1 శాతం లేదా 0.5 శాతం వెన్న తీసిన పాలతో కలిపి మొక్కలు నాటిన 30, 40, 50 రోజులకు పిచికారి చేస్తే కొంతమేరకు ఈ వైరస్ వ్యాప్తిని నివారించవచ్చు.

### 7. మల్లె/ బోడు

- వేసవిలో తరచూ లోతు దుక్కిలు చేయటం వలన పొగాకు పంట ఈ మల్లె బారిన పడకుండా ఉంటుంది.
- ఖరీఫ్ ఎర పంటలైన జొన్న, నువ్వులు, మినుము, పెసరతో పంటమార్పిడి చేస్తే మంచిది.
- ఎకరాకు 100 కిలోల వేప పిండి మొక్కకు రెండువైపులా డోలప్ పద్ధతిలో (30-35 రోజులు) వేసుకోవాలి.
- బోడుకు పూత వచ్చేలోపే పెకలించి నాశనం చేయడం ద్వారా భూమిలో దాని విత్తన భారాన్ని తగ్గించవచ్చు.
- పైన చెప్పిన పద్ధతులన్నింటిని పాటించి సమగ్ర సస్యరక్షణ ద్వారా బోడు ఉధృతిని తగ్గించవచ్చు.

## తల తృంచుట

- వంగడమును మరియు ఆకు నాణ్యతను బట్టి 22-26 ఆకులు మొక్కపై ఉండేలా చూసి, పూమొగ్గ కనిపించిన వెంటనే తలత్రుంచాలి.
- పిలకలను అరికట్టుటకు సి.10 ఫ్యాటీ అల్కహాల్తో తయారు చేసిన 4 శాతం డెకనాల్ లేదా సక్కరవుట్ లేదా రాయల్టన్ మొదలగునవి వాడుకోవాలి.

## ఆకు రెలుపులు

- ప్రతి రెలుపుకు బాగా పక్వమునకు వచ్చిన ఆకులను 2-3 మాత్రమే రెలచాలి.
- మొదటి రెలుపుల ఆకులు (మొక్క క్రింది భాగాన) లేతాకుపచ్చ రంగులో ఉండి కొద్దిగా పసుపు వర్ణం లోనికి మారుతున్నప్పుడు రెలచాలి. తరువాత మొక్క మధ్య భాగాన రెలుపులు ఆకులు పక్వదశకు వచ్చి లేత పసుపు రంగుకు మారినప్పుడు రెలచాలి. చివరి రెలుపులు ఆకు బాగా పసుపు రంగుకు మారినప్పుడు రైలచాలి.
- సాధ్యమైనంతవరకు ఆకు రెలుపులు ఉదయం 9 గంటల లోపు పూర్తి చేయాలి.
- రెలిచిన ఆకులకు బాగా ఎండ వేడి తగలకుండా చేసుకోవాలి.
- అకాల వర్షము పడినయెడల రెలుపులు 3-4 రోజుల తరువాత చేయాలి.

## క్యూరింగ్

- రెలిచిన ఆకులను కర్రలకు అల్లి, బారన్లో ఎక్కించి క్రింది షెడ్యూల్లో క్యూరు చేసి, మండెలు వేసుకోవాలి.

### క్యూరింగ్ షెడ్యూలు

| దశ | ఉష్ణోగ్రత | వెంటిలేటర్లు | |
|---|---|---|---|

| | (డ్రై బల్బు) | వెట్ బల్బు | | వ్యవధి (గంటలు) |
|---|---|---|---|---|
| రంగు వచ్చు దశ | 90-105°F | 80-94°F | 2 అంగుళములు తెరవవలెను | 36-48 |
| రంగు నిలుచు దశ | 105-120°F | 94-98°F | క్రింద కిటికీలు 3-5 అంగుళములు మరియు పై కిటికీలు 3-5 అంగుళములు తెరవవలెను | 5-11 |
| ఆకు అరుదశ | 120-145°F | 98-110°F | పై కిటికీలు మరియు క్రింద కిటికీలు క్రమేణ మూసివేయాలి | 25-40 |
| కాడ అరుదశ | 145-160°F | 110-114°F | అన్ని కిటికీలు మూసివేయాలి | 24-36 |

## క్యూరింగ్ ఇంధనం

- సాధారణ ఇంధనం: వంట చెఱకు.
- ప్రత్యామ్నాయ ఇంధనం: కొబ్బరి మట్టలు, మొక్కజొన్న కండెలు, అగ్రి బయోమాస్ బ్రిక్కెట్లు మరియు సౌరశక్తి (పి.సి.ఆర్.సి.)

## క్యూరింగ్లో సమస్యలు - వాటి నివారణ

### 1. బ్యారన్ రాట్

- ఆకులు తడిగా ఉన్నప్పుడు రెలిచి బ్యారనులో ఎక్కించినప్పుడు సంభవిస్తుంది. దీని నివారణకు ఆకులు తడిగా ఉన్నప్పుడు రెలుపు చేయకూడదు.

### 2. స్పాంజింగ్

- అధికంగా కర్రలను లోడు చేయకూడదు మరియు రంగు వచ్చే దశలో అధిక ఉష్ణోగ్రతల వద్ద వేగంగా క్యూరింగ్ చేయకూడదు.

### 3. బారను స్కాలు

- ఆకు ఆరుదల దశలో గంటకు 1 నుండి 2°F కంటే హెచ్చుగా ఉష్ణోగ్రతను పెంచకుండా జాగ్రత్త తీసుకోవాలి.

### 4. పచ్చ గ్రేడులు

- పక్వతకురాని ఆకులు రెలిచి బ్యారనులో పెట్టకూడదు. రంగు వచ్చే దశలో, రంగు పూర్తిగా రాకుండా 105°F ఉష్ణోగ్రతను మించి పెంచకూడదు.

### 5. కారమలైజెడ్ లీఫ్

- కాడ ఆరే దశలో ఉష్ణోగ్రత 160°F దాటకుండా చూసుకోవాలి. అడుగు టైర్లలో ఆకులను ఫ్లూ గొట్టాలకు ఎడంగా ఉండేటట్లు పెట్టుకుంటే మాడు గ్రేడులు రావు.

### 6. రన్ బ్యాక్ లీఫ్

- కాడ ఆరే దశలో బ్యారన్లో ఉష్ణోగ్రత మధ్యలో పడిపోకుండా జాగ్రత్త తీసుకోవాలి.

## గ్రేడింగ్, బేలింగ్ మరియు అన్యపదార్ధాల నియంత్రణ

- క్యూరు చేసిన ఆకును మండె వేసుకొనేటప్పుడు, ఆకులో తేమ శాతం తగినంత మాత్రమే ఉండేటట్లు చూసుకోవాలి. ఒక వేళ తేమ ఎక్కువగా ఉన్నఎడల, మండె తిరగవేసి, తేమ తగ్గేలా చూడాలి.
- క్యూరైన పొగాకును మొక్కపై ఆకు స్థానాన్ని బట్టి (అనగా పి, ఎక్స్, ఎల్, టి, ప్లాంట్ పొజిషన్స్) గ్రేడు చేయాలి. ఆ తరువాత ఆకు రంగును మరియు మచ్చల ఆధారంగా గ్రేడింగ్ చేయాలి. పచ్చ మరియు మాడు గ్రేడులను వేరువేరుగా ఉంచాలి.
- పొగాకు వేళ్ళు కట్టేటప్పుడు, బేళ్ళలో ఒకే గ్రేడు ఆకు ఉండేలా చూసుకోవాలి. మంచి గ్రేడు బేళ్ళలో కొంత తక్కువ గ్రేడు పొగాకు ఉన్నప్పుడు, వేలంలో రేటు తక్కువ వచ్చే అవకాశం ఉంది.
- పొగాకు వ్యర్థ పదార్థాలు, రాళ్ళు, చెక్కలు, ప్లాస్టిక్ దారాలు, పురికొసలు, పక్షుల ఈకలు, రేపర్లు, కాగితపు ముక్కలు, ఇతర మొక్కల ఆకులు, చెత్త పదార్థాలు మొదలైనవి బేళ్ళలో ఉండకుండా జాగ్రత్త పడాలి.

## పంట మార్పిడి

- పొగాకు విషయంలో కూడా పంట మార్పిడి తప్పనిసరిగా చేయాలి. కాని మార్పిడి చేసే పంటలను ఎంచుకోవడంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- నేల తక్కువ సారవంతంగా ఉంటే భూసారాన్ని పెంచే పెసర, మినుము, పిల్లిపెసర, వేరుశనగ లాంటి పంటలను గాని, జనుము లాంటి పైరు వేసి పచ్చిరొట్ట ఎరువుగా భూమిలో కలియదున్నాలి.

# తేలిక నేలల్లో బర్లీ పొగాకు సాగు

బర్లీ పొగాకు తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలలోని ఏజెన్సీ ప్రాంతాలలోను మరియు తెలంగాణ, గుంటూరు జిల్లాలలోని తేలిక నేలల్లోను వర్షాధార పంటగా పండిస్తున్నారు. మనదేశంలో, తేలిక నేలల్లో పండించు బర్లీ పొగాకుకు, విదేశాలలో మంచి గిరాకీ ఉంది. బర్లీ పొగాకును వర్జీనియా పొగాకుతో మిశ్రితం చేసి సిగరెట్లను తయారుచేయుదురు.

## భూమి తయారీ

- వేసవిలో తొలకరి వర్షాలు పడిన వెంటనే, బర్లీ పొగాకు పండించే భూమిని ట్రాక్టరు నాగలితోగాని, ఇనుప నాగలితోగాని, లోదుక్కి చేయాలి. ఇలా చేయడం వలన కలుపు మొక్కల విత్తనాలు, వేరుకాయ, భూమి నుండి జనించి వ్యాపించే శిలీంద్రాలు నశిస్తాయి. ఇందువలన, వర్షాకాలంలో పడే

వర్షపు నీరు పల్లంలోకి దొర్లిపోకుండా వీలైనంత ఎక్కువ నీరు నేలలో యింకిపోయి, పంటకు ఉపయోగపడుతుంది.

- పదునుచూచి మూడు, నాలుగు సార్లు భూమిని బాగా దున్ని, చదునుచేసి, బోదెలు చేయడానికి అనువుగా తయారుచేయాలి. వరుసల మధ్యదూరం 90 సెం॥మీ॥ గా ఉంచి మార్కరుతోలి, రిడ్జరు సహాయంతో సుమారు 35 నుండి 40 సెం.మీ. ఎత్తుగల బోదెలు చేయాలి. ఏజెన్సీ ప్రాంతంలో, భూమి ఎగుడు, దిగుడుగా ఉంటుంది కాబట్టి, బోదెలు వాలుకు అడ్డంగా వేసుకొంటే వర్షపునీరు బాగుగా నేలలోనికి యింకిపోయి పంటకు అనుకూలంగా వుంటుంది.

## వంగడములు

- బాంకేట్ ఎ-1 మరియు విజేత (వైబి -22)

## బర్లీ పొగాకు నాటే సమయం

- మొక్కలు నాటుటకు జులై 15 నుండి ఆగష్టు 15 వరకు సరైన సమయము. పొగాకు సేద్యంలో నారు ఎంపిక చాలా ముఖ్యము కాబట్టి ఆరోగ్యవంతమైన, ధృఢమైన, పెన్సిలు మందము కాండము కలిగిన నారు మొక్కలను ఎంచుకోవాలి. ఈ నారును, బోదెలపై నాటుకోవాలి. బోదెలపై నాటుట వలన, మొక్కల మొదళ్ళలో వర్షపునీరు నిల్వ ఉండదు. మొక్కల వ్రేళ్ళకు బాగా పట్టుదొరికి వృద్ధి చెందుతాయి. ఏజెన్సీ ప్రాంతంలో వీచే బలమైన గాలికి, మొక్కలు పడిపోకుండా తట్టుకొని, నిలబడగలుగుతాయి.

## మొక్కల సాంద్రత

- వరుసకు వరుసకు మధ్యదూరం 90 సెం. మీ., మొక్కకు మొక్క మధ్యదూరం 45 సెం.మీ. ఉండేవిధంగా మార్కరుతో బోదెలపై చేసిన సాళ్ళపై నాటుటకు ఎకరానికి దాదాపు 10,000 మొక్కలు పడతాయి.

## సేంద్రియ ఎరువులు

- బాగాచీకిన పశువుల ఎరువు, ఎకరానికి 4 టన్నుల చొప్పున చివరి దుక్కిలో వెదజల్లి నేలలో కలియదున్నాలి.

## రసాయనిక ఎరువులు

- నత్రజని కొరకు డైఅమ్మోనియం ఫాస్ఫేటు (డి.ఎ.పి.)ను గాని, కాల్షియం అమ్మోనియం నైట్రేటు (సి.ఎ.ఎన్.) ను గాని, అమ్మోనియం సల్ఫేటును గాని వాడవచ్చును. భాస్వరం కొరకు డి.ఎ.పి.ని గాని, సూపర్ ఫాస్ఫేటును గాని వాడవచ్చును. పొటాషియం కొరకు పొటాషియం సల్ఫేటును మాత్రమే వాడాలి. క్లోరైడు కలిగి ఉన్న ఎరువులను ఎంతమాత్రము వాడకూడదు.
- ఏజన్సీ ప్రాంతంలో పండించే బర్లీ పొగాకులో, కాల్షియ ధాతులోపం తరచుగా కన్పిస్తుంది. కాబట్టి, రెండవ సారి వేసే ఎరువులలో నత్రజని కొరకు కాల్షియం అమ్మోనియం నైట్రేటును తప్పనిసరిగా వేసుకొంటే ఈ లోపం రాకుండా వుంటుంది.

మొక్క నాటిన 7 నుండి 10 రోజులకు ఎరువుల మోతాదు ఈ క్రింది సూచించిన మోతాదులో వేసుకోవాలి.

| ఎరువు పేరు | మోతాదు (ఎకరానికి) |
|---|---|
| మొదటి దఫా (క్రింద సూచించబడిన మూడు రకాల ఎరువుల సిఫార్సులలో ఏదో ఒకటి అనుసరించాలి. | |
| 1. డి. ఎ. పి. | 50 కిలోలు |
| సి.ఎ.ఎన్. | 60 కిలోలు |
| పొటాషియం సల్ఫేటు | 20 కిలోలు |
| 2. 28:28 | 90 కిలోలు |
| పొటాషియం సల్ఫేటు | 20 కిలోలు |
| 3. అమ్మోనియం సల్ఫేటు | 125 కిలోలు |
| సూపర్ ఫాస్పేటు | 125 కిలోలు |
| పొటాషియం సల్ఫేటు | 20 కిలోలు |
| రెండవదఫా (మొక్క నాటిన 25 నుండి 30 రోజులకు) | |
| కాల్షియం అమ్మోనియం నైట్రేటు | 100 కిలోలు |
| పొటాషియం సల్ఫేటు | 20 కిలోలు |

- సిఫార్సు చేసిన ఎరువుల కంటే తక్కువ మోతాదు వాడినట్లయితే మొక్కలో పెరుగుదల తగ్గడమే కాక ఆకులో నాణ్యత లోపిస్తుంది. దిగుబడులు తగ్గుతాయి. నత్రజని ఎరువులను ఎక్కువ వాడినట్లయితే ఆకులో నికోటిన్ శాతము పెరిగి నాణ్యత తగ్గుతుంది.

## అంతరకృషి

- మొక్కలు నాటిన 40 రోజుల వరకు దాదాపు రెండు, మూడు సార్లు అంతరకృషి తప్పనిసరిగా చెయ్యాలి. దీనివలన నేలగుల్లబారి, వేళ్ళకు గాలిసోకి, వేరు చక్కగా భూమిలోనికి చొచ్చుకొనిపోయి, మొక్క పెరుగుదల బాగుంటుంది. తేమతోపాటు పోషకపదార్థములన్నీ మొక్కకు తగిన రీతిలో అంది, ఆకు నాణ్యత, దిగుబడులు పెరుగుతాయి. దీనివలన కలుపు మొక్కలు కూడా నశిస్తాయి. వర్షం పడినతర్వాత, రిడ్జేరుతో బోదెలు అవసరాన్నిబట్టి ఎక్కవేయాలి.

## ఆకురెలుపు

- బర్లీ పొగాకు సుమారు మొక్కనాటిన 55 నుండి 60 రోజులకు రెలుపుకు వస్తుంది. మొక్క అడుగుభాగం నుండి ఆకులు పక్వానికి వస్తాయి. ఒక్కొక్క రెలుపుకు 3-4 పక్వానికి వచ్చిన

- ఆకులను తీయాలి. కొద్దిగా పుసుపు రంగుకు తిరిగిన ఆకులను పక్వానికి వచ్చినట్లుగా భావించాలి. రెలిచిన ఆకులు జిడ్డుగా ఉంటాయి కాబట్టి, ఆకులకు ఇసుక, మట్టి అంటుకోకుండా చూసుకోవాలి. దీనికోసం ఆకును గోనె పట్టల మీద గాని, పాలిథీన్ పట్టల మీదగాని పెట్టుకోవాలి.

## క్యూరింగు

- ఒక ఎకరములోని బర్లీ పొగాకును క్యూరు చెయ్యడానికి 10 మీ × 5 మీ × 5.25 మీటర్ల క్యూరింగు పాక(బారను)ను నిర్మించుకోవాలి. ఇటువంటి ప్రతి క్యూరింగు పాకలో తాడుకు 100 ఆకులు కల్గిన, 900 తాళ్ళు పడతాయి. క్యూరింగు పాకలు, బాగా గాలి ప్రసరించే చోట ఏర్పాటు చెయ్యాలి. అందుకని పాకలను గాలికి వాటంగా వేసుకోవాలి. పాకలను లోయలలో గాని, కొండ దిగువలలో గాని కట్టగూడదు.
- రెలిచిన ఆకులను కిత్తనార లేదా పురికొసతో, ఒక్కొక్క తాడుకు సుమారు 100 ఆకులను ఎడా పెడగా గుచ్చాలి. ఈవిధంగా చేసినయడల గాలి అన్ని ఆకులకు బాగా ప్రసరించి, క్యూరింగు బాగా జరిగి, బర్లీ పొగాకులో నాణ్యత పెరుగుతుంది. ఇలా ఆకు గుచ్చిన తాళ్ళను క్యూరింగు పాకలలో పైనుంచి లోడు చేసుకొంటురావాలి. క్యూరింగు సమయంలో వాతావరణ ఉష్ణోగ్రత 18°C నుండి 35°C వరకు ఉంటుంది. కాబట్టి క్యూరింగు బాగా జరుగుటకు, ఆకు నాణ్యత పెరుగుటకు తగినంత సమయమును ఇవ్వవలెను. లేనిఎడల, పులికాడ పడి, నాణ్యత గణనీయంగా తగ్గుతుంది.
- ఆకుక్యూరింగును క్యూరింగు పాకలలోనే తప్పనిసరిగా చేయాలి. ఈ పాకలలో మందు డబ్బాలు, ఎరువుల బస్తాలు గాని వుంచరాదు. పశువుల పాకలలోగాని, గాలిచోరని యిళ్ళలోగాని, వంటశాల దగ్గరలోగాని క్యూర్ చెయ్యరాదు. పశువుల పాకలలో క్యూరు చేసిన ఆకు. సహజసిద్ధమైన పొగాకు వాసన కోల్పోయి పశువుల మలమూత్రముల వాసనతో కూడి ఉంటుంది.
- క్యూరింగు దాదాపు మూడు నుండి నాలుగు వారాలు పడుతుంది. క్యూరు చేసిన ఆకులను మొక్కపై ఆకు స్థానమును బట్టి, ఐదుగ్రేడులుగా విభజించుకొని, విడివిడిగా బేళ్ళుకట్టాలి.

## బర్లీ ఆకు గ్రేడులు

1. WBF - ఫ్లైయింగ్స్
2. WBB - అడుగు ఆకులు
3. WBM - మధ్య ఆకులు
4. WBT - పైభాగపు ఆకులు
5. ND - ఏ గ్రేడులోకి రాని ఆకులు

# లంక పొగాకు సేద్యంలో రసాయనిక ఎరువులు వాడే విధానము

- గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రాంతాలైన తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఖమ్మం జిల్లాలలో గల 8,000 హెక్టార్ల లంక భూములలో, చుట్టలకు ఉపయోగించే లంక పొగాకును విస్తారంగా పండిస్తున్నారు. ఒక తూర్పు గోదావరి జిల్లాలోనే ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, అయినవిల్లి లంక, ముమ్మిడి వరం, ఐలండ్ పోలవరం, ఆలమూరు, కపిలేశ్వరపురం, పామర్రు, కడియం, రాజమండ్రి, సీతానగరం మరియు దేవీపట్నం మండలాల్లో గల గోదావరి నదీ తీర ప్రాంత లంక భూముల్లో సుమారు 6,000 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ లంక పొగాకును పండించుచున్నారు.
- లంక పొగాకు వంగడం లంకా స్పెషల్ను రైతులు విరివిగా సాగు చేస్తున్నారు.
- మొక్కకు మొక్కకు మధ్య దూరం 80 సెం. మీగాను మరియు వరుసల మధ్య 80 సెం.మీ ఎడంలో మొక్కలు నాటుకోవాలి. నాట్లువేయుటకు అక్టోబరు, నవంబరు మాసాలు అనువైనవి.
- లంక పొగాకు రైతులు సాంప్రదాయకంగా నత్రజని ఎరువును, అవసరానికి మించి, అధిక మోతాదులో, సుమారు హెక్టారుకు 800 కిలోల నుండి 1200 కిలోల నత్రజనిని, యూరియా రూపంలో (32 నుండి 48 బస్తాలు యూరియా ఒక హెక్టారుకు) పొగమొక్కల మధ్య, భూమి ఉపరితలం మీద జల్లి, వెంటనే గాని, లేదా మరుసటి రోజున గాని నీరు పెట్టడం పరిపాటి.
- ఎరువులను తక్కువ మోతాదులో అనగా హెక్టారుకు 300 కిలోల నత్రజని (యూరియా రూపంలోను), 50 కిలోల భాస్వరము మరియు 50 కిలోల పొటాష్ (ఎస్.ఒ.పి)ను వాడి, ఎక్కువ దిగుబడి, మంచి నాణ్యత గల, లంక పొగాకును పండించే శాస్త్రీయ విధానాన్ని, కేంద్ర పొగాకు పరిశోధనాలయం, రాజమండ్రి వారు, తూర్పు గోదావరి జిల్లా ఆత్రేయపురం మండలంలోని పేరవరం గ్రామంలో క్షేత్ర ప్రదర్శన ద్వారా 1991-92 పొగాకు సీజనులో నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్, కాకినాడ వారి సహాయ సహకారములతో లంక పొగాకు రైతులకు చూపించడం జరిగినది. ఈ క్షేత్ర పరిశోధనా ఫలితాలను లంక పొగాకు రైతుల సౌకర్యార్థం క్రింద వివరించడం జరిగినది.
- హెక్టారుకు 20 కిలోల నత్రజనిని, మరియు 50 కిలోల భాస్వరాన్ని 110 కిలోల డి.ఎ.పి. రూపంలోను, 50 కిలోల పొటాష్ను 100 కిలోల సల్ఫేట్ ఆఫ్ పొటాష్ ద్వారాను ఆఖరి దుక్కిలో వేసి, నేలలో బాగా కలిసేటట్లు చేయవలెను.
- మొక్కకు, మొక్కకు 80 సెం.మీ. దూరం ఉంచి వరుసల మధ్య 80 సెం.మీ. దూరంలో హెక్టారుకు 27,777 మొక్కలను నాటవలెను.

- హెక్టారుకు 300 కిలోల నత్రజని ఎరువును యూరియా ద్వారా (డి.ఎ.పి. ఇచ్చిన 20 కిలోల నత్రజని మినహాయించి), 3 దఫాలుగా, మొక్కలు నాటిన 30, 45, 65 రోజుల పిమ్మట "డోలప్" విధానములో అనగా మొక్కకు 10 సెం.మీ. దూరంగాను, 10 సెం.మీ. లోతులో, గసిక వేసి, ఆ రంధ్రములో ఎరువు వేసి వెంటనే మట్టితో కప్పి, నీరు పెట్టడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, మంచి నాణ్యత గల లంక పొగాకును పండించవచ్చును.
- "డోలప్" విధానంలో ఎరువులు వేసి, వెంటనే నీరు పెట్టడం వలన నత్రజని ఎరువు నీటిలో కరిగి, మట్టి కణాలచే పీల్చబడి, సాగునీటిలో భూగర్భంలోకి వృధాగా కొట్టుకొని పోకుండా అరికట్టబడుతుంది.
- దీనికి భిన్నంగా, యూరియా ఎరువును అధిక మోతాదులో (అనగా 800 నుంచి 1200 కిలోలు/ హెక్టారుకు) మొక్కల మధ్య భూమి ఉపరితలం మీద జల్లి, నీరు పెట్టడం వల్ల యూరియాలో ఉన్న నత్రజని నీటిలో కరిగి కొట్టుకొని పోవడం మరియు అమ్మోనియాగా ఆవిరి రూపంలో వాతావరణంలోకి పోయి వృధా అవటం జరుగుతుంది.
- ఈ పద్ధతిలో ఎరువును తక్కువ మోతాదులో (హెక్టారుకు 400 కిలోలకు మించకుండా) వేయడం వలన 800 నుండి 1200 కిలోల ఎరువును నేలపై జల్లిన పద్ధతితో సరిసమాన పరిమాణంలో దిగుబడి, ఆకు నాణ్యత, ఘాటు వంటి లక్షణములు గల పొగాకును పండించవచ్చును.
- ఈ క్షేత్ర ప్రదర్శన తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలంలోని పేరవరం గ్రామంలో జరిగినప్పటికి, మిగిలిన మండలాలు/ జిల్లాలలోని లంక పొగాకు రైతులు కూడా వారి భూములకు చేరు ఒండ్రుమట్టి మరియు భూసారాన్ని బట్టి ఎరువుల పరిమాణంలో స్వల్ప మార్పులను చేసుకొనవలయును.

# హెచ్.డి.బి.ఆర్.జి. బర్లీ పొగాకు సాగు పద్ధతులు

హెచ్.డి.బి.ఆర్.జి. బర్లీ (హార్వెల్ డి బాకోస్ రియో గ్రాండి)ని వాడుక భాషలో నల్లబర్లీ అని లేదా పచ్చ బర్లీ అని పిలుస్తారు. ఈ బర్లీ పొగాకును వర్జీనియా పొగాకుతో కలిపి సిగరెట్ల తయారీలో వాడెదరు. ఈ పొగాకును దక్షిణ మధ్య నల్లరేగడి నేలలోను మరియు తెలంగాణ జిల్లాలలోని కొన్ని ప్రాంతాల్లో 4 వేల హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు.

## ఆనుకూల వాతావరణము

- హెచ్.డి.బి.ఆర్.జి. బర్లీ పొగాకు పంటను అక్టోబరు, నవంబరు మాసములలో నల్లరేగడి భూముల్లో పండిస్తారు. వర్షాకాలంలో పడిన వర్షం నీరు ఈ

నల్లరేగడి భూముల్లో నిలువ వుండి, బర్లీ పంట పెరుగుదలకు ఉపయోగపడుతుంది. ఈ ప్రాంతములలో ఈశాన్య ఋతుపవనముల వల్ల దాదాపు 800 నుండి 1000 మి.మీ. వర్షము పడుతుంది. భూమిలో నిలువ వున్న తేమ ఆధారంగా పచ్చబర్లీ పొగాకు పెరుగుతుంది. నైఋతి ఋతుపవనముల వల్ల వచ్చు వర్షాలు పంట ఎదుగుదలకు, అధిక దిగుబడికి సహకరిస్తాయి. ఇది వర్షాధార పంట క్రింద హెక్టారుకు 1500 నుండి 2000 కిలోలు, నీటి పారుదల క్రింద 2500 కిలోల దిగుబడి వస్తుంది.

## అనువైన భూములు వాటి స్వభావములు

- ఉదజని సూచిక 7.0 నుండి 8.5 వరకు గల నల్లరేగడి భూములు చాలా శ్రేష్ఠమైనవి. ఈ భూములలో నత్రజని పాలు తక్కువగాను, భాస్వరం పాలు మధ్యస్థంగాను ఉండి, పొటాషియం అధికంగాను వుంటుంది. కాబట్టి ఈ పంటకు వేసే నత్రజని గాని, భాస్వరం గాని మంచి దిగుబడినిస్తాయి. నేలలో క్లోరైడులు 100 పి.పి.యమ్., నీటిలో 50 పి.పి.యం. దాటినచో హెచ్.డి.బర్లీ పొగాకు పండించుటకు పనికిరాదు.

## వేసవి దుక్కులు

- బర్లీ పొగాకు పండించు భూములను వేసవిలో అంటే మార్చి, ఏప్రిల్ లో మోల్డ్ బోర్డ్ నాగలిని ఉపయోగించి లోదుక్కి దున్నుకోవాలి. ఇందువలన కోశస్థ దశలోనున్న పురుగు, రోగకారక శిలీంద్రములు, వేరుకాయ పురుగులు, కలుపు విత్తనములు, కలుపు దుంపలు, ఎండవేడిమికి నశిస్తాయి. ఇంతేకాకుండా వర్షాకాలంలో వర్షపు నీటిని సమృద్ధిగా నిలువ చేసుకొని పంట ఎదుగుదలకు సహకరిస్తుంది.

## తొలకరి సేద్యము

- ఆగష్టు - సెప్టెంబరు మాసములలో భూముని నాగలితో మెత్తగా దున్నుకోవాలి. గొర్రులు వేసుకున్న తర్వాత భూమిలో వున్న కలుపుమొక్కలను తీసివేసి, అడ్డ సహాయముతో నేలను చదును చేసుకోవాలి. ఇలా చేసినందువలన భూమిలోని తేమ ఆరిపోదు.

## నాట్లు

- ఎరువులు వేసిన తరువాత అక్టోబరు రెండవ వారంలో భూమి అదనను బట్టి 80 సెం.మీ. అచ్చుతో ఎరువులు వేసిన సాళ్ళలో ఇరువైపులా అచ్చులు వేసుకొనవలెను. ఎంపిక చేసిన వంగడములను, చీడపీడలు లేకుండా వున్న ధృఢమైన మొక్కలను ఈ అచ్చుమీద నాటుకొనవలెను (15,625 మొక్కలు). మొక్క నాటుటకు భూమిలో వేర్ల దగ్గర మట్టిని అదిమి లోతుగా నాటుకొనవలయును. పాదులో వేసే నీరుకు ఎండోసల్ఫాన్ మందును నిర్ణీత మోతాదులో కలిపి వేసిన, మొక్కలను పెంకి పురుగు బారి నుండి కాపాడవచ్చును. నాటిన వారం, పది రోజుల లోపుగా పడి మొక్కలు వేసినచో మొక్కల సాంద్రత ఒకేరీతిలో వుండి ఎదుగుదల బాగుంటుంది. మణేదలు

ఆలశ్యం చేసినచో ఎదుగుదల లోపించి దిగుబడులు తగ్గే అవకాశం ఉన్నది.

## ఎరువులు

- మంచి దిగుబడుల కోసం హెక్టారు భూమిలో 100 కిలోల నత్రజనిని (500 కిలోల అమ్మోనియం సల్ఫేటు), 50 కిలోల భాస్వరమును (325 కిలోల సూపర్ ఫాస్ఫేటు), 50 కిలోల పొటాషియంను (100 కిలోల పొటాషియం సల్ఫేటు) ఇచ్చు ఎరువులను వాడుకొనవలెను. ఈ ఎరువులతోపాటు 50 కిలోల నత్రజనినిచ్చు సేంద్రియ ఎరువులైన పశువుల ఎరువుకాని, వేప పిండికాని, వేరుశనగ పిండి గాని వేసుకున్నచో అధిక దిగుబడులు లభించును.

## ఎరువులు వేయు విధానము

- పైన చెప్పిన ఎరువుల మిశ్రమాన్ని సెప్టెంబరు 3వ వారంలో నాగలి సాళ్ళలో (సాలుకి, సాలుకి 80 సెం.మీ. దూరం) సమానంగా వేసి అడ్డతో కప్పి వుంచవలెను. దీని వలన వేసిన ఎరువులను భూమి గ్రహించుకొని మొక్కలు ఏపుగా పెరిగి అధిక దిగుబడులను ఇస్తాయి.

## అంతరకృషి

- నల్లరేగడి భూమిలో ఈ పైరు పెరుగుదల చాలావరకు అంతరకృషి మీద ఆధారపడి వుంటుంది. మొక్కలు నాటిన 15-20 రోజుల నుండి 3 పళ్ళవరుస గొర్రుతో అంతరకృషి చేయవలసి వస్తుంది. భూమి ఆరుదలను బట్టి ఈ అంతరకృషి గొర్రుతోగాని, గుంటకతో గాని 10-15 రోజుల వ్యవధితో చేయవలసి వస్తుంది. పొలంలో ఎటువంటి పరిస్థితులలోను నెర్రులు కొట్టకుండా జాగ్రత్తవహించవలెను. నెర్రులు కొట్టిన ఎడల భూమి ఆరుదల పెరిగి, పంట బెట్టతీసి ఆకు దిగుబడులు గణనీయంగా తగ్గిపోతుంది.

## తలవిరుచుట, పిలకలు తృంచుట

- బర్లీ మొక్కలు తలలను 20-22 ఆకులు పరిమితి వరకు ఉంచి తల విరువవలెను. ఈ తల విరుచుట వలన ఆకు మందం పెరిగి దిగుబడులు 8 నుంచి 10 శాతం పెరుగును. తల విరిచిన వెంటనే 1-2 రోజుల లోపున ఆకు చంకలలో పిలకలను అరికట్టుటకు 4 శాతం డెకనాలు గాని, 20 శాతం వేపనూనె నవనీతమును గాని వారం వ్యవధిలో రెండు సార్లు వేయవలెను.

## ఆకుపరిపక్వత - విరుచుట

- పంటకు వచ్చిన బర్లీ పొగాకును మూడు దఫాలుగా గెలుచుట ఆనవాయితి. మొదటి దశలో క్రింది ఆకులు, రెండవ దశలో మధ్య ఆకులు, మూడవ దశలో చివరి ఆకులు రెలుచుకొనవలయును. బర్లీ పొగాకు నాటిన 60-70 రోజులలో భూసారమును బట్టి పక్వమునకు వచ్చిన క్రింది ఆకులను రెలుచుకోవచ్చును. ఈ ఆకులు తేలికరంగులో పలుచగా వుంటాయి.

## మధ్య ఆకులు

- మంచి సౌష్టవముగా పొడవు, వెడల్పు కలిగి ఉంటాయి. పంట దిగుబడి ఈ ఆకుల సంఖ్య మీద ఆధారపడి వుంటుంది. ఈ ఆకులు మంచి రంగును మరియు సువాసనను కలిగి వుంటాయి. మలి గెలుపులో ఆకులు అంటే చివరి ఆకులు పొట్టిగా, బలిష్టంగా ముదురాకు పచ్చ రంగులో గరుకుగా ఉంటాయి.

## ఎండకట్టుట - మండెలు వేయుట

- పైవిధముగా విరిచిన ఆకులను దబ్బలములతో 200-250 ఆకుల వరకు దండెములుగా గుచ్చి ఎండలో ఆరబెట్టవలయును. ఆకులు మరియు కాడ ఎండుటకు దండెముల మీద దాదాపు 30-35 రోజుల వరకు పడుతుంది. బాగుగా ఎండిన ఆకులు మంచి రాగి రంగు కలిగి ఉండి, కమ్మటి వాసనను కలిగి వుంటాయి. ఇలా ఎండిన ఆకులను చల్లని సమయములయందు తాళ్ళనుండి వేరుచేసుకొని మండె వేసుకొనవలయును. మండెలలో తేమ మరియు వేడి ఎక్కకుండా 8-10 రోజుల వ్యవధిలో 3-4 సార్లు తిరగవేయవలెను. ఇలా చేయుట వలన ఆకులు పరిపక్వత పెరిగి సువాసనలు వెదజల్లును. అయితే మండెలు వేయునప్పుడు క్రింది ఆకులను, మధ్య ఆకులను, పైఆకులను వేరువేరుగా విభజించి పెట్టుకొనవలయును. దీని వలన మంచి ధర వచ్చే అవకాశం వుంది. అమ్మకానికి ముందు ఆ ఆకులను 80-100 కిలోల వరకు వుండునట్లు బేళ్ళు కట్టుకొని అమ్మవలెను.

## గ్రేడింగ్

- హెచ్.డి.బర్లీ పొగాకును విరుపుల ఆధారంగా గ్రేడింగ్ చేసెదరు. 1) క్రింది ఆకులు 2) మధ్య ఆకులు 3) చివరి ఆకులు. ఈవిధముగా చేసిన ఆకులను 2 రకములుగా విభజించెదరు. మొదటి రకం ఆకులు మంచి తేనె రంగును కలిగి వుండి, నలగ కుండా పరిపక్వమునకు వచ్చిన పొడుగాటి ఆకులు. ఇవి మంచి సౌష్టవము కలిగి వుండి, నిర్దిష్టమైన బర్లీ పొగాకు వాసనను కలిగి వుంటాయి. రెండవ రకం ఆకులు పొట్టిగాను, తక్కువ సౌష్టవం కలిగి ముదురు రంగులో వుంటాయి. ఈ ఆకులు అంత పరిపక్వత చెందక చిరుగులు కలిగి ఆకు రాలిపోతుంది.

## ఆకు నాణ్యత

- హెచ్.డి.బర్లీ పొగాకు మండెల నుండి వేరుచేసిన తర్వాత క్రింది, మధ్య, పై ఆకులను వేరు వేరుగా చేసుకొని రంగు, పొడవు, బరువు, మందము ఆధారముగా ఆకులను వేరుచేసి, బేళ్ళు కట్టుకొనవలయును.

# తేలిక నేలల్లో నాటు పొగాకు సాగుకు మేలైన యాజమాన్య పద్ధతులు

తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఖమ్మం, విశాఖపట్నం, విజయనగరం మరియు శ్రీకాకుళం జిల్లాలలోని తేలిక నేలల్లో నాటుపొగాకును నీటిపారుల కింద పండిస్తున్నారు. సుమారు 25 వేల హెక్టార్లలో సాగు చేయబడుతూ, 50మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తవుతుంది. ఈ పొగాకును చుట్టలు, నశ్యం, చౌకరకపు సిగరెట్లు తయారు చేయడానికి ఉపయోగిస్తారు. ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేయబడుతుంది.

## వంగడములు

- ఈ ప్రాంతాలలో పెద్దవిత్తనం, రంగాపురం, పొట్టివిత్తనం, పైరువిత్తనం, కొమ్ముగూడెం అను రకాలు సాగులో ఉన్నాయి. పెద్దవిత్తనం, రంగాపురం తోరణం పద్ధతిలో క్యూరు చేయడానికి, పొట్టి విత్తనం, పైరువిత్తనం, కొమ్ముగూడెం కట్ట పద్ధతిలో పొగాకు క్యూరు చెయ్యడానికి అనుకూలమైనవి.

## భూమితయారీ

- ఎండాకాలంలో భూములను లోతుగా దుక్కి దున్నాలి. ఇట్లు చేయుట వలన భూమిలోని శిలీంధ్రములు, కలుపు మొక్కలు, కీటకముల గ్రుడ్లు బయటపడి సూర్యరశ్మి నశిస్తాయి. తొలకరి జల్లుల తర్వాత 6 డిస్కుల ట్రాక్టరుతో దున్నాలి. ఇలా చేస్తే భూమి చదునై కలుపు మొక్కలు కుళ్ళిపోతాయి. తర్వాత వర్షాకాలం ముగిసేలోపు అప్పుడప్పుడు ట్రాక్టరు కల్టివేటరు తోలితే, పొలం పరిశుభ్రంగా ఉండి, అనుకూల భౌతిక లక్షణాలు కలిగి ఉంటుంది. అక్టోబరు మొదటి వారంలో ఒకసారి నాగడలితోలి, బల్ల తోలితే భూమి చదునై మార్కరు తోలడానికి అనువుగా ఉంటుంది.

## నాట్లు

- ధృఢంగా, ఏపుగా పెరిగి, కాండం గట్టిగా, పెన్సిలు లావు ఉండి; ఎటువంటి జబ్బులు అనగా మానుమచ్చ, ఆకుమచ్చ మొదలైనవి, పోషక పదార్థాల లోపాలు, తెగుళ్ళు, వేళ్ళకు వేరు కాయ శిలీంధ్రములు లేనినారును ఎంచుకోవాలి. ఎటుచూసినా 80 సెం.మీ. (80 × 80 సెం.మీ.) దూరంలో మొక్కలు నాటాలి. అక్టోబరులో నాట్లు పూర్తిచేయాలి. ఒకవైపు మార్కరు లైనులో నాగలి తోలి, ఆ చాలులో నీటిని ప్రవహింపచేసి మార్కరు విభజన స్థానాలలో మొక్కలు పాతి, నాట్లు పూర్తిచేయాలి. అలాచేస్తే నూటికి నూరుపాళ్ళు నాటిన మొక్కలు బ్రతికి, మణివేతల ఖర్చును తగ్గించవచ్చు. ఒకేసారి నాటిన మొక్కలు స్థిరపడుటవలన పొలం పనులకు అనుకూలంగా ఉంటుంది. తప్పనిసరి పరిస్థితులలో మణివేతలకు వేయవలసినచో, నాటిన వారంలోపల పూర్తిచేయాలి. నాట్లు వేసే సమయంలో ఎండ బాగా ఎక్కువగా ఉంటే కొత్తగా నాటిన మొక్కలకు తాటాకు డొప్పలుగా చేసి

గొడుగులుగా అమర్చాలి. ఇలాచేస్తే లేత పొగమొక్కలు ఎండదెబ్బకు తట్టుకొని బతుకుతాయి.

## ఎరువులు

- మొక్కలు నాటుటకు నెల రోజుల ముందు ఎకరానికి 12 టన్నుల పశువుల ఎరువు మరియు 400 కిలోల వేరుశనగపిండి దుక్కిలో వేసి కలియదున్నాలి. మొక్కలు నాటిన 20 రోజులకు ఎకరానికి 44 కిలోల డి.ఎ.పి., లేదా 125 కిలోల సూపర్ ఫాస్ఫేటు, 90 కిలోల యూరియా మరియు 20 కిలోల సల్ఫేటు ఆఫ్ పొటాష్ (ఎస్.ఒ.పి) వేయాలి. మొక్కలు నాటిన 40 రోజులకు 90 కిలోల యూరియా, 30 కిలోల సల్ఫేటు ఆఫ్ పొటాష్ ఎరువులు, నాటిన 60 రోజులకు 90 కిలోల యూరియా మరియు 30 కిలోల సల్ఫేటు ఆఫ్ పొటాష్ ఎరువు ప్రతి ఎకరాకు వేయాలి. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల మోతాదులు సవరించి వాడాలి. వేసే ఎరువులు మొక్కలకు ఇరువైపులా 10 సెం.మీ. దూరంలో 10 సెం.మీ. లోతున కన్నాలు చేసి (డోలప్ పద్ధతి) వేసి మట్టి కప్పాలి. తడి పెట్టి ఆరు పదును మీద ఎరువులు వేస్తే పైరుకు బాగా ఉపయోగపడతాయి. క్లోరైడు కలిగిన ఎరువులను ఎట్టి పరిస్థితులలోనూ వాడకూడదు.

## అంతరకృషి

- పొగమొక్కలు నిలదొక్కుకున్న తర్వాత గొర్రు, గుంటకలతో చాళ్ళ మధ్య రెండువైపులా ఎడ సేద్యము చేయాలి. దీనివలన నేల గుల్లబారి, వేళ్ళకు గాలిబారి, బాగా ఎదిగి, చక్కగా చొచ్చుకొనిపోయి మొక్క పెరుగుదల బాగుంటుంది. కలుపు మొక్కలు నశిస్తాయి. తేమతోబాటు పోషక పదార్థాలు మొక్కకు తగుమోతాదులో అందుతాయి. 40 రోజుల తర్వాత పళ్ళ గొర్రుతో లోతుగా దున్ని, రిడ్జేరుతోగాని, పారలతోగాని మొక్కల మొదలుకు బాగా మట్టి ఎక్కేటట్లుగా గట్లు తయారుచేయాలి. దీని తరువాత పంట పెరుగుదలను బట్టి, అవసరాన్ని బట్టి రిడ్జరుతో గాని, పారలతోగాని మట్టి ఎక్కవేస్తూ గట్లను బలపరచాలి.

## నీరు పెట్టుట

- సాగునీటిలో పదిలక్షల పాళ్ళలో క్లోరైడు పాళ్ళు 50 కంటే ఎక్కువ ఉన్నచో ఆ నీరుపొగాకు సాగుకు పనికిరాదు. ఉదయాన్నే పంటను గమనించినపుడుమొక్కల ఆకులు సోలి, వాడిపోయినపుడు వెంటనే నీరు పెట్టుట అవసరమని గ్రహించాలి. మొక్కలు నిలదొక్కుకునే వరకు మొక్కలు నాటిన చాలు ప్రక్కన నాగలి చాలులో కొద్దిమోతాదులో నీరు ప్రవహింపచేయాలి. తర్వాత 15 రోజులకొకసారి అవసరాన్ని బట్టి చిన్నమళ్ళుగా కట్టి 2.5 సెం.మీ. నీరు పెట్టాలి. అంతరకృషి ఆపిన తర్వాత కాల్వలు, గట్లు (దొయ్యలు) వేసి నీరు పెట్టాలి.

## తలత్రుంచుట, పిలక తీయుట

- పూగుత్తి కన్పించగానే మొక్కపై 18 ఆకులుంచి తలత్రుంచాలి. వెంటనే డెకనాల్ 4 శాతం ద్రావణాన్ని గాని, ఎకోటాబ్ 0.75 శాతము ద్రావణాన్ని గాని, వేపనూనె 30 శాతము ద్రావణాన్ని గాని మొక్క పైభాగపు ఐదారు ఆకుల చంకలలో మొక్కకు 10 మి.లీ. వంతున వేయాలి. ఇదే విధంగా 15 రోజుల తర్వాత మళ్ళీ ఒకసారి వేయవలసి ఉంటుంది. దీనిని ఆకులపై పడకుండా జాగ్రత్తపడాలి. పిలకలు నిర్మూలించే మందులు దొరకని పక్షంలో ప్రతి ఐదు రోజులకొకసారి పిలకలను చేతితో త్రుంచివేయాలి. లేకపోతే పోషక పదార్థాలన్ని పిలకల పెరుదుగుదలకే ఖర్చు చేయబడి, ఆకు పెరుదుదల, మందము తగ్గి, దిగుబడి, నాణ్యత కోల్పోతుంది.

## ఆకుకోత

- పక్వదశకు వచ్చినపుడు మొనలు వెనుకకు తిరిగినట్లు కన్పిస్తాయి. అప్పుడు కోత ప్రారంభించవచ్చు. తోరణం పద్ధతిలో ఆకు క్యూరింగు చెయ్యదలచినపుడు ఆకులను కొద్దికాండముతో సహా (గవ్వ) కోయాలి. దీనిని గవ్వకోత అంటారు. ఆకులను “కట్టపద్ధతి"లో క్యూరు చెయ్యాలను కున్నప్పుడు మొక్క మొదలుకు నరకాలి.

## క్యూరింగు

### తోరణం పద్ధతి

- గవ్వకోతతో కోసిన ఆకును మేలిమి, గుల్లగా విభజించి, విడివిడిగా తోరణములుగా కుట్టి సూర్యరశ్మిలో పందిరికి కట్టాలి. 25-30 రోజులకు ఆకు మధ్య ఈనెలు పూర్తిగా ఎండిపోతాయి. అలా ఎండిపోని ఆకులను 'పులికాడ' అంటారు. పులికాడ లేదనుకున్నప్పుడు ఆదయాన్నే ఆకు పదును చూచి మండె వేయాలి. అలా వేసిన మండె పదునును బట్టి వారానికి ఒకసారి 6-8 సార్లు తిరగవేసిన యెడల ఆకులలో రసాయన మార్పులు జరిగి మంచి రంగు, సువాసన వస్తుంది.

### కట్టపద్ధతి

- ఈ పద్ధతిలో మొదలుకు నరికిన మొక్కలను తలక్రిందులుగా పల్చగా కప్పిన పందిరికి వ్రేలాడకట్టాలి. ఆకులు ఈనెలతో సహా పూర్తిగా ఎండిపోయిన తర్వాత మొక్కలు పదును మీద ఉన్నప్పుడు క్రిందికి దించి మొక్కవరుసలలో మండెవేసి, తాటాకుతో గాలి చొరకుండా కప్పాలి. మండెలు ప్రతి మూడవరోజు తిరగవేయాలి. ఈవిధంగా మొక్కల కాండము నల్లగా వచ్చువరకు మండెలు మార్చుతూ ఉండాలి. అప్పుడు ఆకును కాండము నుండి వేరుచేసి, మేలిమి, గుల్ల గ్రేడులుగా విభజించి, పది ఆకులు కలిపి కట్టగా కట్టాలి. ఇలా కట్టిన ఆకు కట్టలు వరుస మందములో అడ్డము నిలువులుగా మండె వేయాలి. ఈ మండెలలో ఎక్కువ ఉష్ణము పుట్టి, శిలీంద్రములు పెరగకుండా ఉండుటకు వీటిని ప్రతి మూడవరోజు

తిరుగవేస్తూ ఉండాలి. ఈవిధంగా ఆకు బాగా మాగి, మంచి రంగు, వాసన వచ్చి సరియైన పదును వచ్చేవరకు మండెలు మార్చుతూ ఉండాలి. ఆ తర్వాత ఆకు కట్టలను తాటాకు బుట్టలలో నింపి అమ్మకానికి సిద్ధం చేయాలి.

## పంట మార్పిడి

- వేరుకాయ, కీటకములు, తెగుళ్ళ బారి నుండి పంటను రక్షించి నాణ్యతగల నాటు పొగాకును పొందాలంటే పంటమార్పిడి తప్పనిసరి.

| | ఖరీఫ్ | రబి |
|---|---|---|
| మొదటి సంవత్సరము | కంది | బీర లేక దోస |
| లేక | బీర, దోస | వేరుశనగ |
| రెండవ సంవత్సరము | మొక్కజొన్న | నాటు పొగాకు |
| లేక | పచ్చిరొట్ట పైరు | నాటు పొగాకు |

- ఈవిధంగా సిఫార్సు చేసిన యాజమాన్య పద్ధతులను పాటించి సస్యరక్షణలో శ్రద్ధవహిస్తే రైతులు నాణ్యతతో కూడిన అధిక నాటు పొగాకు దిగుబడులు పొందవచ్చును.

కేంద్ర పొగాకుపరిశోధనా సంస్థ వారు నిర్దేశించిన సేద్యపు పద్ధతులను అవలంబించి, రైతులు అధిక దిగుబడితో కూడిన నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేసి, అంతర్జాతీయంగా కూడా ఖ్యాతిపొందవచ్చును.

గమనిక: కేంద్ర పొగాకు బోర్డు వారు నిర్దేశించిన పంట సాగు పరిమాణము మరియు విస్తీర్ణము రైతులు తప్పనిసరిగా పాటించినట్లయితే పండించిన పొగాకుకు నరసమైన ధర లభిస్తుంది.
మరిన్ని వివరాలకు డైరెక్టర్, ఐ.సి.ఏ.ఆర్. కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ, రాజమండ్రి వారిని సంప్రదించవచ్చును.